సత్తాచాటిన ప్రభుత్వ విద్యార్థులు


ఇష్రాత్ పర్వీన్


విఘ్నేష్


సకీనా


హేమలత


చందన

గోల్కొండ: గోల్కొండ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాయని గోల్కొండ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ మహ్మద్ బషీద్ తెలిపారు. గోల్కొండ బాలుర ఉన్నత పాఠశాల సెకండ్ లాన్సర్ వంద శాతం ఫలితాలు సాధించిందని, అదే విధంగా ముఫిద్ ఉన్ నిస్వాన్ ఉర్దూ మీడియం ప్రభుత్వ పాఠశాల కూడా వంద శాతం ఫలితాలు సాధించిందన్నారు. బాలికల ప్రభుత్వ సెకండ్ లాన్సర్ ఉన్నత పాఠశాల కూడా వంద శాతం ఫలితాలు సాధించిందని, అదే విధంగా గోల్కొండ రిసాలబజార్‌లోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల వంద శాతం, లంగర్‌హౌస్‌లోని ఎస్ఎంహెచ్ఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 94 శాతం ఫలితాలు సాధించిందన్నారు. గోల్కొండ ప్రభుత్వ తెలుగు ఉన్నత పాఠశాల 95 శాతం ఫలితాలు సాధించిందన్నారు.

నాంపల్లి మండల పరిధిలో..

సుల్తాన్‌బజార్: నాంపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదివే విద్యార్థులు ఎస్ఎస్సీ ఫలితాలలో సత్తాచాటారు. సుల్తాన్ బజార్ ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంలో 100 శాతం ఫలితాలు వచ్చాయి. అదేవిధంగా తెలుగు మీడియంలో 86 శాతం ఫలితాలు వచ్చాయి. ఇదే పాఠశాలకు చెందిన ఇష్రత్ పర్వీన్ అనే విద్యార్థినికి 539 మార్కులు వచ్చాయి. విద్యార్థినికి పాఠశాల హెచ్ఎం సుష్మిత శుభాకాంక్షలు తెలియజేశారు.

నయాబజార్‌లో..

నయాబజార్ పాఠశాల 10వ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. విఘ్నేష్ 600 మార్కులకు 511 మార్కులు సాధించి అందరి మన్ననలు అందుకున్నాడు.

చార్మినార్ మండల పరిధిలో 7 పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత..

యాకుత్‌పురా: పది ఫలితాల్లో చార్మినార్ మండల పరిధిలోని ఏడు పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. మండలంలోని మొత్తం 16 పాఠశాలలకు చెందిన మొత్తం 375 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఇందులో 330 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని మండల విద్యాశాఖ డిప్యూటీ ఈఓ సుజాత తెలిపారు. చాదర్‌ఘాట్ జీహెచ్ఎస్ స్వీట్ మోడల్ పాఠశాలకు చెందిన విద్యార్థిని సాకీనా 541 మార్కులు సాధించిదన్నారు. అదే విధంగా జీబీహెచ్ఎస్ మొఘల్‌పురా-02, జీహెచ్ఎస్ యాకుత్‌పురా తెగా, జీజీహెచ్ఎస్ చెత్తబజార్, జీబీహెచ్ఎస్ దరీచ్‌మెట్, జీజీహెచ్ఎస్ చంచల్‌గూడ, జీహెచ్ఎస్ రెయిన్‌బజార్, జీజీహెచ్ఎస్ చావునీ నాదేఅలీ బేగ్ పాఠశాలల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.

చాంద్రాయణగుట్టలో..

చాంద్రాయణగుట్ట: బండ్లగూడ మండల పరిధిలోని చాంద్రాయణగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటారు. డి.హేమలత 508 మార్కులు, ఎం.చందన 505 మార్కులు, టి.కార్తీక్ 498 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాల సత్తాను మరోసారి నిరూపించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను డిప్యూటీవో ఆదిత్య వర్ధన్,ఉప విద్యాశాఖ అధికారి ఎస్.లక్ష్మణ్ సింగ్, కె.దశరథ్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సీహెచ్. నారాయణ, కె.సునీత, పి.శ్రీనివాస్‌లు అభినందనలు తెలిపారు.

తోట వైకుంఠానికి యుద్ధవీర్ స్మారక పురస్కారం



నాంపల్లి: కళా రంగంలో తోట వైకుంఠం చేసిన అద్భుతమైన కృషికి, తెలంగాణ ప్రాంతాన్ని ప్రపంచ పటంలో ఉంచినందుకు గాను యుద్ధవీర్ స్మారక పురస్కారానికి ఎంపికయ్యారు. యుద్ధవీర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రెడ్‌హిల్స్‌లోని కేఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో 32వ యుద్ధవీర్ స్మారక పురస్కార ప్రదానోత్సవ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ఆమేర్ అలీ ఖాన్, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, ఫౌండేషన్ చైర్‌పర్సన్ అరుణా బహుగుణ, ఫౌండేషన్ కార్యదర్శి విష్మావీర్ చేతుల మీదుగా అందుకున్నారు. ట్రస్టీలు తరుణ్ కుమార్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బసవేశ్వర జయంతి



చార్మినార్: మహాత్మా బసవేశ్వరుడు ప్రతి ఒక్కరికి ఆదర్శంగా ఉంటాడని టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ నాగనాథ్ మాశెట్టి అన్నారు. మహాత్మా బసవేశ్వర జయంతిని టీఎస్ బసవ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజేష్ మాశెట్టి, శివ మాశెట్టి, ధర్మేందర్ పూజారి, జ్యోతి, విద్యా, రాధిక, దర్శన, శ్రీనివాస్, పండరి, దీపక్, మోహన్, కిరణ్, సాయినాథ్, వీరేశ్ యాదవ్ వారిష్ కామిశెట్టి పాల్గొన్నారు.

పాత మిలటరీ క్వార్టర్స్‌లో జీఓ 118 అమలు చేయాలి



గోల్కొండ: పాత మిలటరీ క్వార్టర్స్‌లో జీఓ 118 అమలు చేయాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన రక్షణ శాఖ ఎస్టేట్ ఆఫీసర్ దినేష్‌కుమార్‌రెడ్డిని కలిశారు. శిథిలావస్థకు చేరుకున్న మిలటరీ క్వార్టర్స్‌కు చిన్న మరమ్మతులు సైతం చేయనివ్వకుండా మిలట్రీ వారు అడ్డుకుంటున్నారని ఆయన అన్నారు. ఎస్టేట్ అధికారులకు అనేక సార్లు వినతిపత్రాలు ఇచ్చి మిలట్రీ క్వార్టర్స్‌లో నివసించే వారి కన్నీటి గాదలు వినిపించామన్నారు. ఇప్పటికైనా జీఓ 118ను అమలు పరుస్తూ మిలటరీ క్వార్టర్స్‌లో నివసించే అర్హులైన కుటుంబాలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ విషయంపై చర్చించి చర్యలు తీసుకుంటానని ఎస్టేట్ ఆఫీసర్ హామీ ఇచ్చారు.

గోషామహల్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి



అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గం అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మంత్రి, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సంతోష్‌గుప్తా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి నియోజకవర్గంలో ఉన్న సమస్యలతో కూడిన మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ వారిని సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..మమతా గుప్తా, సంతోష్‌గుప్తా తమ దృష్టికి తెచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

కేటీఆర్ రూ.100 కోట్ల పరువునష్టం దావా వాయిదా

సిటీ కోర్టులు: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొండా సురేఖపై దాఖలు చేసిన రూ.100 కోట్ల పరువునష్టం దావా విచారణ బుధవారం హైదరాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టులో జరిగింది. నాగచైతన్య, సమంతల విడాకుల విషయంతోపాటు సినీ ఇండస్ట్రీలో పలువురు విడాకుల తీసుకోవడానికి తనే కారణమంటూ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు సరైన కావని, ఎలాంటి ఆధారాలు లేకుండా ఆమె అసంబద్ధమైన వ్యాఖ్యలు చేయడంతో సమాజంలో తన పరువుకు భంగం కలిగిందని పేర్కొంటూ కేటీఆర్ రూ.100 కోట్లకు పరువునష్టం దావా వేసిన విషయం తెలిసింది. ఈ కేసు విచారణను సిటీ సివిల్ కోర్టు 25వ అదనపు చీఫ్ జడ్జి కోర్టు చేపట్టింది. ఈ కేసులో మొత్తం (16 మందిపై) అందులో ప్రతివాది-1 కొండా సురేఖతోపాటు మరో 15 ప్రతికలు, టీవీ ఛానళ్లపై కేటీఆర్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ విచారణలో పలువురు కౌంటర్లు దాఖలు చేయగా పలు పత్రికలకు సంబంధించిన వారు దాఖలు చేయాల్సి ఉంది. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు వచ్చే వాయిదా లోపు మిగతా ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను వచ్చేనెలకు వాయిదా వేస్తున్నట్లు కోర్టు సూచించింది.

భక్తిశ్రద్ధలతో అక్షయ తృతీయ పూజలు



చార్మినార్: అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకొని అలంకార బ్రహ్మ శృంగారం ఆత్రేయ ఆచార్య ఆధ్వర్యంలో బుధవారం చార్మినార్‌లోని శ్రీ బాలాజీ మందిరంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అక్షయ తృతీయ శుభ మూల మంతన హవనంలో భాగంగా కుబేర అష్టలక్ష్మి ధన ప్రాప్తి హవనంతో పాటు 108 సుగంధ ద్రవ్యాలతో పంచామృత అభిషేకం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి.

ఆశీర్వాదం



చార్మినార్: తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణారావుకు చార్మినార్‌కు చెందిన అలంకార బ్రహ్మ ఆత్రేయ ఆచార్యులు బుధవారం ఆశీర్వచనాలు అందజేశారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఆయనను ఆశీర్వదించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు నిరసనగా 'బత్తిగుల్'

గోల్కొండ: వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి నిరసనగా ముస్లింలు బుధవారం బత్తిగుల్ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఆల్ ఇండియా పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు బుధవారం రాత్రి 9 గంటల నుంచి 9.15 నిమిషాల వరకు ముస్లింలు తమతమ నివాసాలు, షాపులలో లైట్లు ఆఫ్ చేసి నిరసన తెలిపారు. మాసాబ్‌ట్యాంక్, అహ్మద్‌నగర్, గోల్కొండ, షేక్‌పేట్, టోలిచౌకీ, హకీంపేట్ తదితర ప్రాంతాల్లో మజ్లిస్ పార్టీ నాయకులు స్థానిక ముస్లిం యువజన సంఘాల వారు ఈ బత్తిగుల్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

గంజాయి తాగుతున్న ఇద్దరికి జైలు

గౌలిపురా: గంజాయి తాగుతున్న ఇద్దరికి 15 రోజుల జైలు శిక్ష విధించిన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. అలీకాలనీకి చెందిన ఎలక్ట్రీషయన్ సల్మాన్ ఖాన్ (33), సయ్యద్ తిపు (43) ఇటీవల స్టేషన్ పరిధిలో గంజాయిని సేవిస్తున్నారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసుకొని బుధవారం నాంపల్లిలోని 4వ స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ సత్యనారాయణ ముందు హాజరు పరచగా ఇద్దరికి 15 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.